

# కథా కౌముది

## దూరం దాసరి రామచంద్రరావు



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

"... అవునా ? ఈ ఊరిలోనే ఉన్నాడా?"

"అవును మిమ్మల్ని తీసుకురమ్మన్నారు . రండి వెళ్దాము."

" చీకటి పడుతోంది... ఉదయాన్నే వెళ్దాం ..." అన్నాడు, మాధవరావు.

"ఇప్పుడే వెళదాము నాన్నా... రేపు ఇంకేదో పనుందంటారు. అయినా కలవబోతున్నది మీ ఓల్డ్ ఫ్రెండ్ నే కదా ! యాంగ్జయిటీ లేకపోడం ఏటీ" అని కొడుకు రోహిత్ అడిగేసరికి కాదనలేకపోయాడు మాధవరావు.

రోహిత్ వినీత్ లు గత మూడేళ్లుగా స్నేహితులు . ఇప్పుడు ఇద్దరూ పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. వినీత్ నాన్న రాజారావు. ఏదో సందర్భం లో రోహిత్ మాట్లాడుతున్నప్పుడు మాధవరావు గురించి విని – "... అయితే నేనూ, మీ నాన్నగారు స్నేహితులం . ఓ సారి ఇంటికి తీసుకురా..." అని చెప్పారు. అందుకే బైక్ మీద తన కొడుకుతో అక్కడికే బయలుదేరాడు మాధవరావు.

ఎనబయి తొమ్మిదినాటి మాట. మాధవరావు, రాజారావు లు, కాకినాడ దగ్గర సర్పవరం లో బీఈడీ ట్రైనింగ్ అయ్యారు. ఆ తర్వాత ఆంధ్రా యూనివర్సిటీ లో ఎమ్మే సోషియాలజీ కలిసే చేశారు. ఇద్దరు జంట పక్షుల్లా తిరిగేవారు. అనేక కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కలిసే రాశారు.

ఆలోచిస్తూనే మాధవ రావు మూడు వీధులు దాటాడు . అనేక మలుపులు మెలికలు తిరిగేక , కొడుకు రోహిత్ తోవ చూపిస్తుండగా వినీత్ ఇల్లు చేరుకున్నారు.

గేటు చప్పుడు విని పరుగున వచ్చాడు రాజారావు. ఇరవై సంవత్సరాల తర్వాత కలయిక. ఇద్దరిలోనూ మార్పులు వచ్చినా అవి పరస్పరం పోల్చుకోడానికి అడ్డు కాలేదు.

భార్యను పిలిచి–" ఎవరనుకున్నావు ? నా బెస్ట్ ఫ్రెండ్ బీ ఈ డీ ట్రైనింగ్ లోను యూనివర్సిటీ లోను – ఇప్పుడు హెడ్ మాస్టర్ గా పనిచేస్తున్నాడు. వీళ్లబ్బాయే రోహిత్ ..." పరిచయం చేశాడు, రాజారావు. ఆమె మొఖం సంతోషంతో నిండిపోయింది.

"చాలా బాగుంది. పిల్లలే కాదు మీరు కూడా స్నేహితులే... కూచోండి అన్నయ్య గారూ. టీ తీసుకొస్తాను" అంటూ వంటగది లోకి వెళ్ళింది. ఇంతలో వినీత్ వచ్చి రోహిత్ ని తన గదిలోకి తీసుకుపోయాడు. రాజారావు ,మాధవరావు లు మాటల్లో పడిపోయారు. "తొంబై మూడులో కదా మనం విడిపోయినదీ. ఫేర్ వెల్ పార్టీ లో ఎంత హంగామా చేశామూ..." జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఇంతలో టీ తెచ్చి వారిద్దరికీ అందించి అక్కడే కూచుంది, రాజారావు భార్య ఇందిర .

"అమ్మా మేమిద్దరం భలేగా తిరిగేవాళ్ళం. అనేక విషయాల్లో ఇద్దరివీ ఒకేరకమైన అభిప్రాయాలు..." మాధవరావు చెప్తున్నాడు.

" వింతగా వుంది అన్నయ్యగారు. ఒకే ఊర్లో వుండి తెలియకుండా వుండడం.. పిల్లల వలన తెలిసింది. ఇకనేమి? పిల్లల్లాగే మనమూ ఎప్పటికప్పుడు కలుసుకోవచ్చు. వదినగారూ పరిచయం అయిపోతే, ఇంకా బాగుంటుంది." ఆనందంతో అంది ఇందిర.

'అలాగేనమ్మా రేపు నా భార్య శైలజ ను తీసుకువస్తా'నని లేచాడు మాధవరావు.

వెంటనే ఇందిర – "చెప్పండి అన్నయ్య గారితో" చిన్నగా కదిపింది, భర్తతో.

"ఏంటమ్మా" అని అడిగాడు మాధవరావు.

"మీరెందుకూ రేపు మేమే మీ ఇంటికి వస్తున్నాం. అక్కడే అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు. మీ ఇల్లు చూసినట్టూ ఉంటుంది. మా చెల్లెమ్మ కూడా పరిచయం అయినట్టూ ఉంటుంది." అన్నాడు, రాజారావు.

సరేనంటూ రోహిత్ ని కేక వేసి పిలిచాడు మాధవరావు. "ఉండనీయండన్నయ్య గారూ ఇక్కడే భోంచేసి వినీత్ తో కలిసి చదువుకుంటాడు. ఉదయం పంపిస్తాను" అంది, ఇందిర.

"సైకిల్ తెచ్చుకోలేదుకదమ్మా... రేపు ఎలాగూ కలుస్తాము కదా !" అని చెప్పి మాధవరావు కొడుకుతో బయలుదేరుతుండగా –

"రేపు సాయంత్రం మేము వస్తున్నాముురా" అని కేకేసి చెప్పేడు రాజారావు.

★ ★ ★

వంటగదిలో శైలజ, ఇందిర లు కబుర్లు చెప్పుకుంటూ వంటలో పడ్డారు. భోజనాలయ్యాక మళ్లీ కబుర్లలో పడ్డారు. అవన్నీ– పిల్లల ప్రస్తుత చదువులు, రేంకులు, భవిష్యత్ కోర్సులు వీటి చుట్టూనే… " ఏమోనండీ తలుచుకుంటేనే భయం వేస్తోంది" అంది శైలజ.

"ఏం ఫరావాలేదండీ అంతా సవ్యంగానే జరుగుతుంది. ఇప్పట్నుంచే టెన్షన్ దేనికి…" ధైర్యం చెప్పింది ఇందిర .

చర్చ పిల్లల చదువుపై మళ్ళింది. మరో మూడు నెలల్లో వినీత్, రోహిత్ ల పదవతరగతి పరీక్షలు అయిపోయాయి. ఇద్దరూ మెరిట్ లోనే ఉన్నారు. ఇద్దరూ ఐ ఐ టి ఫౌండేషన్ క్లాసులోనే ఉన్నారు. ఇదే స్కూల్ యాజమాన్యం వారికి గుంటూరులో జూనియర్ కాలేజీ ఉంది. పెద్ద కేంపస్ . ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి గుంటూరు కాలేజీ విశేషాలు చెప్పి ఒప్పించి సరాసరి ఇక్కడి పిల్లలనంతా అక్కడ జాయిన్ చేసే ప్రయత్నంలో –

మాధవరావు, రాజారావులను కూడా కలిశారు. వీళ్ళు మాత్రం — "పదోతరగతి పూర్తవ్వనీయండీ అప్పుడు చెప్తాం…" అని సమాధాన పరిచారు.

ఇప్పుడు మాధవరావు ఇంట్లో ఆ చర్చే జరుగుతోంది. పిల్లలిద్దరూ మంచి స్నేహితులు. ఒకరికొకరు తోడుంటారు. అక్కడ జాయిన్ చేయడానికి అభ్యంతరాలు ఏమీ లేవని నిర్ణయించుకున్నారు.

" అమ్మో! అంతా దూరమా!?" శైలజ తన బెదురు బయట పెట్టింది.

"ఇకపై పై చదువులన్నీ బయట చదవాల్సినవే. అదేదో ఇప్పటినుంచే అలవాటు పడటం మంచిద"ని చెప్పాడు రాజారావు.

"ఏమోనండీ… వీడి ఆరోగ్యం అంతంత మాత్రమే. దగ్గరుంటేనే గాని సరిగా భోజనం చేయడు . ఎప్పుడూ జలుబూ దగ్గును.." చెప్తోంది శైలజ.

ఇందిర శైలజ చేయి నొక్కుతూ–" మొదట్లో మనం పది రోజులకొకసారి వెళ్ళి వస్తుంటాం. ఒకసారి మీరు వెళతారు. ఒకసారి మేము వెళ్తాం. అలా దగ్గరదగ్గరగా చూసి వస్తుంటే వాళ్ళకీ ధైర్యంగా వుంటుంది…" అంది.

వెంటనే రాజారావు అందుకొని– "శ్రీకాకుళం నుండి విజయవాడ డైరెక్టు బస్సులున్నాయ్. అక్కడ నుంచి గుంటూరు గంట. రాత్రి ఎక్కితే తెలవారేసరికి పిల్లలదగ్గర వుంటాం". అని భరోసాగా అన్నాడు. మాధవరావు వైపు చూసింది, శైలజ.

అతను ఎన్నో ఆలోచిస్తున్నాడు. తనకి ఒక్కడే కొడుకు. బాగా చదువుతాడు. మంచి రీజనింగున్నవాడు. సరైన కోచింగ్ ఉంటే బాగా రాణిస్తాడు. ఫరావాలేదన్నట్టు భార్యవైపు చూసి "సరే అలాగే చేద్దాం" అన్నాడు. ఇదంతా విన్న రోహిత్, వినీత్ లు "మేము ఇంటర్ గుంటూర్ లో చదువుదామనుకుంటున్నాం. చాలా బాగుంటుందట. మా టీచర్స్

చెప్తున్నారు.'' అని పిల్లలు కూడా అంగీకారము తెలిపేరు. వినీత్ మరింత ముందుకు వెళ్ళి – "మీ కెందుకు ఆంటీ నేనున్నాను కదా! ధైర్యంగా ఉండండి.'' అని అంటుంటే శైలజ కు పల్చగా కళ్ళలో నీళ్ళు తిరిగేయి. రోహిత్ కంటే వినీత్ కొంచెం పెద్దగా లావుగా కనిపిస్తాడు. చొరవున్నవాడు. ధైర్యవంతుడిగా కనిపిస్తున్నాడు.

"అలాగే బాబు. సరే తప్పకుండా... నీ ధైర్యమే. ఇప్పుడు చూసేవుగా అన్నం ఎలా సగం సగం తిని వొదిలీసేడో. టైమ్ కి కడుపునిండా తినే పిల్లాడయితే ఇంకేం కావాలి. అదే నా బెంగ'' అంది కళ్లు తుడుచుకుంటూ.

"అదంతా నేనూ చూసుకుంటాను ఆంటీ'' అన్నాడు వినీత్.

"నేనూ శుభ్రంగా వుంటాను లేమ్మా'' అని ధైర్యమిచ్చాడు రోహిత్.

రోహిత్, వినీత్ లేచి వెళ్లబోయారు. మాధవరావు మాత్రం కాసేపు వారిని ఆపి వినీత్ ను ఉద్దేశించి– "మీ నాన్నతో చాలామంది స్నేహం చేయాలనుకునేవారు. అందరూ ఇష్టపడేవారు. అన్నీ మంచి క్వాలిటీస్. కల్చరల్లోనూ ముందే ఉండేవాడు. మేము పేదరికాన్ని సాధారణంగానే భావించేం. మీ నాన్నతో స్నేహం వలన అటు బిఈడీ లోను, ఇటు యూనివర్సిటీ లోను హాయిగా కాలం గడిచిపోయింది . ఖాళీ దొరికితే లైబ్రరీ లో గడిపేవాళ్ళం. మా స్నేహం అటువంటిది. మీ వలన మళ్లీ మేము కలిసే ము. మీరు ఎప్పుడూ కలిసే ఉండండి. ఎట్టి పరిస్థితులలోనూ విడిపోకండి. మీరిద్దరు బాగా రాణించాలి.'' అని ముగించాడు. పిల్లలిద్దరూ తలలూపి గదిలోకి వెళ్లిపోయారు.

"వాళ్ళ గురించి ఆలోచించనవసరం లేదు. మూడు సంవత్సరాలనుంచి బాగా ఒకరికొకరు కలిసిపోయారు. మనం బలవంతంగా విడదీసినా విడిపోరు. '' నవ్వుతూ అన్నాడు రాజారావు.

"మా రోహిత్ అందరితోనూ గబుక్కున కలవలేడు ... మనసుకలిస్తే మరి వదలడు. అన్ని సమయాల్లో ఒకరికొకరు తోడుంటే అదే చాలు. ధైర్యంగా పంపించగలం.'' ఎమోషనల్ గా అంది, శైలజ.

శైలజ మనసు మళ్లించాలనుకుంది ఇందిర. వెంటనే మాట మారుస్తూ –రాజారావు, మాధవరావుల వైపు దృష్టి సారించి "ఇంత మంచి స్నేహితులు ... ఇన్నాళ్ళూ ఎలా విడిపోయారు?''

మాధవరావు, రాజారావు వైపు చూశాడు.

"సర్వీస్ కమీషన్ గ్రూప్ త్రీ రాసి కేంపస్ నుంచి బయటపడ్డాం. ఇప్పటిలాగా సెల్ ఫోన్ సౌకర్యం లేని రోజులు . ఇళ్ళకాడ పేదరికం . జీవితంతో పోరాటం. రెండు సంవత్సరాల తర్వాత నాకు విలేజ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ గా సోంపేట లో పోస్టింగ్స్... అప్పటికే వీడికి స్కూల్ అసిస్టెంట్ గా ఉద్యోగం వచ్చిందని విన్నాను. తర్వాత పెళ్లి.. పిల్లలు.. సంసారం.. ఉద్యోగం ఒత్తిడులు ట్రాన్స్ఫర్ లూ అలా గడిచిపోయింది కాలం.. ఏరా అంతేనా!'' అన్నట్లు చూసేడు రాజారావు. "ఎగ్జాట్లీ " అన్నాడు మాధవరావు.

★ ★ ★

వినీత్, రోహిత్ లిద్దరు పరీక్షలు బాగా రాసేరు. అసలు వాళ్ళు పరీక్షలు రాస్తుండగానే అనేక ప్రవేటు కాలేజీ యాజమాన్యం వారు ఇల్లు ఎక్కి తొక్కేశారు. అందరూ ఒకటే మాట . 'మా కాలేజీలో చదువెక్కువ– ఫీజు తక్కువ' అని, 'మార్కులు బాగా వస్తే ఫీజులో ఊహించని రాయితీ'లని. మాధవరావుకిదంతా వ్యాపారమయమని తెలుసు. కానీ అనివార్యంగా తాను ఈ పరిస్థితుల్ని ఒప్పుకోక తప్ప లేదు.

పరీక్షలు జరిగిన రెండో రోజే గుంటూరు ప్రయాణానికి ఏర్పాట్లు జరిగిపోయాయి. శైలజకు మనసు మనసులో లేదు. ఇన్నాళ్లూ– రోహిత్ తో గడిపిన క్షణాలు చాలా తక్కువ అని అనిపించింది. పరీక్షలు అయ్యేక సెలవుల్లో తనివితీరా రోహిత్ తో గడుపుదామనుకొంది. ఇన్నాళ్లూ వాడికి– ఖాళీ ఇవ్వని స్కూల్ టైమింగ్స్, ఆదివారాలూ వదలని స్పెషల్ క్లాసులు, కంబైండ్ స్టడీస్, నైట్ క్లాసులు, రివిజన్ టెస్టులు... తనకు– వంట చేయడం, తండ్రీ కొడుకుల బట్టలుతకడం , లంచ్ బాక్సులు కట్టడం ... వీటితోనే ఇన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. చదువుతో వాడు బిజీ.. వాడికి సదుపాయాలు చేయడం తో నేనూ బిజీ.. తెలియకుండానే దూరమై పోయాం. ఏమి జీవితం..!? ఇంతలో, ఇప్పుడు– ఇంటర్మీడియట్ చదువు.. ఇది మరింత దూరం... కనీసం ఇన్నాళ్ళు ఏదో సమయంలో కనిపించేవాడు. ఇప్పుడు?

ఆ ఆలోచనకి– దుఃఖం ముంచుకొచ్చింది, శైలజకు.

★ ★ ★

స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులో పిల్లలిద్దరితో, లగేజీలతో నలుగురూ గుంటూరు బయలు దేరేరు . తిరుగు ప్రయాణానికిమాత్రం రైలుకు రిజర్వేషన్ చేసుకున్నారు. కేంపస్ చాలా బాగుంది. రెండు రోజులు పేరెంట్స్ ఉండదానికి వసతి కల్పించేరు. టైమ్ కి టిఫిన్, మధ్యలో టీ బ్రేక్.. పిల్లలకు స్నాక్స్ , మంచి భోజనం.. ఎవరికి ఎంత కావాలో అంతా. చిక్కటి పెరుగు. మళ్లీ టీ బ్రేక్– పాలు, హార్లిక్స్, స్నాక్స్. రాత్రికి మంచి భోజనం... రెండు రోజులు గడిచి పోయాయి. రేపటి నుంచే క్లాసులు ప్రారంభమట. అన్నిఏర్పాట్లు చేసేసి, కావలసినవి కొని యిచ్చేసి పేరెంట్స్ వెళ్లిపోవాలట.

హాస్టల్ గదులు బాగానే ఉన్నాయి. ఏ సీ కూడా ఉంది. కానీ గదికి పదిమంది లేదా పన్నెండుమందిని ఉంచేరు . పోనీలే వాళ్ళే సర్దుకుంటారు. తినాలే గానీ భోజనం బాగుంది. వాడు బాగా తిని ఆరోగ్యంగా ఉంటే అదే చాలు అని తనకు తాను సరిపుచ్చుకోంది శైలజ. రెండురోజులు గడిచిపోయాయి . ఈ రెండురోజుల్లో– వినీత్ వరండా లోనూ, భోజనాల దగ్గరా ఎవరెవరితోనో కలివిడిగా మాట్లాడేస్తున్నాడు. అది గమనించిన శైలజ, మాధవరావులు ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు. ఫరవాలేదు మనవాడు నెమ్మదిగా అలవాటు పడతాడులే అని సరిపెట్టుకున్నారు.

తిరుగు ప్రయాణానికి సిద్దమయ్యారు. వినీత్ రాజారావుని పట్టుకుని ఏడ్చేశాడు. శైలజ ను పట్టుకుని రోహిత్ ఏడ్చేశాడు . అక్కడకొచ్చిన పేరెంట్స్ అందరి పరిస్థితి అలాగే ఉంది. వదల్లేక వదల్లేక స్టేషన్ కి ఆటోలో బయలుదేరారు.

వారి చుట్టూ బరువైన వాతావరణం. ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నప్పుడు అ కళ్ళలో తప్పు చేస్తున్నామా అనే ప్రశ్నలు కన్పించేయి. తిరిగి అవే కళ్ళల్లో– 'ఫరవాలేదు... తప్పదు మరి' అనే సమాధానాలు కనబడుతున్నాయి.

" ...ఫోన్ చేయనివ్వరట. " ఇందిర అంది. "పిల్లలకు ఏదైనా అవసరం అయితే...!" సందేహం వెలిబుచ్చింది శైలజ. "ఏం ఫరవాలేదు. కోయిన్ బాక్సులున్నాయి. ఏదో కొంత టైమ్ ఇస్తారు... అప్పుడు చేస్తుంటారులే ... " అని చెప్పాడు రాజారావు. అందరూ, ఎవరి మట్టుకు వారు 'పిల్లలతో మనం మాట్లాడాలంటే ఎలా ?' అన్న ఆలోచనలో పడిపోయారు.

వారి ఆలోచనలు చేదిస్తూ రైలు వచ్చింది. ఎక్కి కూచున్నారు. రైలు కదిలింది. శైలజ మాత్రం – వెనక్కి పోతున్న గుంటూరు పట్టణాన్నిఅలా చూస్తూ ఉండిపోయింది. రైలు ఒక్కో స్టేషన్ ను దాటుతుంటే — గుంటూరు పట్టణం దూరమవున్నట్ట నిపించలేదు. పిల్లడికీ తనకూ మధ్య దూరం పెరిగిపోతున్నట్టు భావించింది. 'ఇంత దూరం పిల్లల్ని విడిచి వచ్చేస్తున్నామా' మనసులో అనుకొని మిగిలిన వారి వైపు చూసింది. అందరిలోనూ బహుశా అదే భావన ఉన్నట్టుగా, మౌనంగా ఉండిపోయారు.

రైలు ఏలూరులో ఆగింది. రాజారావు, మాధవరావులు తమ మనసులు మళ్లించుకోడానికి తమ ట్రైనింగ్ రోజులు గుర్తు చేసుకుంటూ తమ భార్యలకు చెప్పబోయారు. వారు వినిపించుకోలేదు. ముభావంగా దిగాలుగా ఉన్నారు.

రాజారావు, మాధవరావులకు అర్థమయ్యింది. మళ్లీ వచ్చేవారం మనలో ఎవరో ఒకరు గుంటూరు రావాలని — ఇంటికి వెళ్ళిన వెంటనే టికెట్స్ బుక్ చేసుకోవాలని నిర్ణయించి, భార్యలకు చెప్పేరు. వారి ముఖాలు కొంచెం వెలిగేయి.

★★★★★★

కాలం గడుస్తోంది క్లాసులు జరిగిపోతున్నాయి. ఇచ్చిన పదిహేడు రోజుల హోమ్ సిక్ సెలవులు ఇట్టే గడిచిపోయేయి. మళ్లీ ప్రయాణాలు జాగ్రత్తలు, టా టా లు బై బై లు. అందరూ నెమ్మదిగా అలవాటు పడిపోయారు.

కాలేజీలో ఐ ఐ టి ఫౌండేషన్ మీద వారాంతపు పరీక్షలు సీరియస్ గా జరిగిపోతున్నాయి. సాయంత్రానికే మార్కులు చెప్పేస్తున్నారు. వినీత్, రోహిత్ లు స్టాండర్డ్ గానే ఉంటున్నారు. ఇతర జిల్లాల వాళ్ళు శ్రీకాకుళం విజయనగరం వాళ్ళను కొంచెం కొంచెం ఎద్దేవా చేయడం రోహిత్ కి ఎందుకో కొత్తగానూ, ఇబ్బంది గానూ వుంది. వినీత్ కున్న సహజ ధోరణి వల్ల అవేవీ పట్టించు కోకుండా మూవ్ అవుతునన్నాడు. ఆ సౌలభ్యం వల్ల కొన్ని రోజులకే వాళ్ళలో తెలివైన వారితో స్నేహం కూడా కలిసింది. రోహిత్ చాలా ప్రయత్నం చేశాడు. తన రూమ్ లోను , క్లాసులోనూ ప్రయత్నించేడు. వినీత్ తో పాటు వుంటే – వాడి ద్వారా వాళ్ళు పరి చయం అవుతారులే అనుకున్నాడు. ఎన్నోసార్లు వినీత్ తో మాట్లాడాలని ప్రయత్నించాడు. కానీ వీలు పడలేదు. వినీత్ ఆ అవకాశం, రోహిత్ కి ఇవ్వలేక పోయాడు. దానికి తోడు యాజమాన్యం అస్సలు వారికి ఖాళీ ఉంచడం లేదు. వినీత్ కున్న కొద్దిపాటి సమయం తన కొత్త స్నేహితులతో గడపడం,

సంభాషించడం రోహిత్ గమనించేడు. అందుకేనేమో తనతో గడపడం తగ్గిపోతూ వచ్చిందని భావించేడు. ఒకప్పుడు ఎలా ఉండేవాళ్లం ... ! మా ఇద్దరి మధ్య ఏమయ్యింది ? ఏమీ అవ్వలేదే !! ఎందుకు దూరమవుతున్నాం

రోహిత్ ఒంటరితనం ఫీలవుతున్నాడు.

ఒక్కోసారి మెస్ లో రోహిత్ దగ్గర కూచున్న వినీత్ కొత్త స్నేహితులు కేకేయగానే పళ్ళెం పట్టుకు వెళ్తూ 'నువ్వూ రా రా' అంటాడు. ఒక్కోసారి రోహిత్ ని చూసినా చూడనట్టు వాళ్లదగ్గరకే వెళ్ళి పోతాడు. రోహిత్ కి ఎందుకో వెళ్లాలనిపించదు. చాలా బాధపడతాడు. 'సరేలే తెలివైన వాళ్ళతో ఫ్రెండ్ షిప్ కోరుకుంటున్నాడేమోన'ని తనకు తాను సరిపుచ్చుకుంటాడు.

ఉదయం ఆరో గంటకే స్టడీ అవర్ ... బ్రేక్ ఫాస్ట్ కి చిన్న బ్రేక్ ... క్లాసులు... లంచ్ ఎప్పుడూ అందరూ బిజీ గానే కనబడుతుంటారు. వినీత్, రోహిత్ లు దగ్గర దగ్గరగా ఉన్నా కూడా మాట్లాడుకోవడమే కుదరడం లేదు. ఉన్న అరగంట ఖాళీ సమయంలో కూడా వినీత్ రోహిత్ తో మాట్లాడింది తక్కువే. అందులోనూ ఎక్కువభాగం డైలీ, వీక్లీ టెస్ట్ ల గురించీ– వార్డెన్ గురించీ – ఫేకల్టీ గురించే ఎక్కువ...

ఇంతలో మరో నెల రోజుల్లో గ్రాండ్ టెస్ట్ ఉందని సర్క్యులర్ వచ్చింది. అందరి గుండెల్లో ఒకటే బెంగ. ఇందులో వచ్చిన మార్కులతో, ఇప్పటివరకు జరిగిన వారాంతపు టెస్టుల్లో వచ్చిన మార్కులూ కలిపి రేంకు నిర్ణయిస్తారట. వందలోపు రేంక్ వచ్చిన వారికి ఫీజు కన్సెషన్ తో పాటు, సెపరేట్ హాస్టల్, సెపరేట్ ఫేకల్టీ, సెపరేట్ క్లాసెస్, సెపరేట్ మెస్ ...వారిని మిగిలిన వారితో కలవ నివ్వరట. కామన్ హాస్టల్ కీ దూరంగా టైటానిక్ షిప్ ఆకారం లో పెద్ద బిల్డింగ్ ఉంది. అందులో వుంచుతారట . ఇంకా మూడు వీకెండ్ టెస్టులున్నాయి. వినీత్, రోహిత్ లు కష్టపడుతున్నారు . పోటీ ఎక్కువుంది. వత్తిడీ ఎక్కువే ఉంది.

ఓ రోజూ ఉదయం రోహిత్ లేవలేక పోయాడు. వార్డెన్ వచ్చి లేపేడు. వొళ్లంతా కాలిపోతోంది. ఊపిరి తిరగని జలుబు. దగ్గు, తలనొప్పి... సిక్ రూమ్ లో ఉంచారు. కేంపస్ డాక్టర్ వచ్చి మందులిచ్చాడు. మాధవరావు కి ఫోన్ చేసేరు.

హుటా హుటి ని బయలుదేరేడు, మాధవరావు.

రూమ్ లో ఒంటరిగా నీరసగా పడుకున్న రోహిత్ ను చూసేసరికి మాధవరావుకి దుఖం తన్నుకొచ్చింది. తమాయించుకున్నాడు. తండ్రిని చూసి రోహిత్ బావురుమన్నాడు. అంతా నీరసం లోను — నిన్న వీకెండ్ టెస్ట్ కి ఎటెండ్ కాలేదని, మార్కులు పోతాయనీ, గ్రాండ్ టెస్ట్ లో నిలబడలేననీ– జె ఈ ఈ స్పెషల్ టీం కి సెలెక్ట్ కాలేనని చెప్పుకొస్తున్నాడు. " నీ ఆరోగ్యం తర్వాతే ఏమైనా... ధైర్యంగా ఉండు... ఇదికాకపోతే ఇంకొకటి. ఐ ఐ టీ ఒక్కటే చదువు కాదు, గోలూ కాదు ... నువ్వు హాయిగా ఉండు కన్నా..." అని అనునయంగా చెప్పేడు. రోహిత్ కి కొంత ఊరట అనిపించింది. తండ్రి కళ్ళలోకి కాసేపు చూసి– ఒడిలోకి తల పెట్టి చేరబడ్డాడు. తల నిమురుతూ తిరుగు ప్రయాణం ఆలోచనలో పడ్డాడు, మాధవరావు.

★ ★ ★

ఇంటికి తీసుకువచ్చి వారం రోజులు ట్రీట్ మెంట్ ఇప్పించేక రోహిత్ కుదురుకున్నాడు. మధ్యలో ఇందిర, రాజారావు లు వచ్చి పరామర్శించేరు. “ఎప్పుడు బయలుదేరుతున్నాడు?” అని అడిగారు.

“మరో రెండు రోజుల్లో దిగబెట్టేద్దామను కుంటున్నాన”ని మాధవరావు చెప్పేడు.

“అబ్బే నువ్వెందుకు? నేను ఎలాగూ వెళ్లాలనుకుంటున్నాను. నాతో తీసుకువెళ్తాను...” అన్నాడు, రాజారావు.

మరుసటి రోజు సడన్ గా వచ్చి “నాకు అర్జెంట్ పని పడింది. రాలేక పోతున్నాన”ని చెప్పేడు. “రాత్రి తొమ్మిది గంటల బస్ కే కదా వెళ్ళేది” అని కేజువల్ గా అడిగి తెలుసుకొని వెళ్ళిపోయాడు.

“ఇంకా నయం ముందే చెప్పాడు” అనుకుంటూ మరుచటి రోజు రాత్రికి రోహిత్ తో పాటు తనకీ టికెట్స్ బుక్ చేసుకున్నాడు మాధవరావు.

ఆ రాత్రి బస్ ఎక్కుతున్న సమయంలో ఇందిర, రాజారావు లు వచ్చారు. ఇందిర చేతిలో రెండు పేకెట్లు ఉన్నాయి. ఆ రెండు పాకెట్ లు రోహిత్ చేతికిచ్చి– వినీత్ కి అందజేయమని చెప్పింది. తర్వాత రోహిత్ బుగ్గలు , జుత్తు నిమురుతూ “బాగా చదువుకో ... ఆరోగ్యం జాగ్రత్త ...”అని చెప్పి దిగిపోయింది. రాజారావు, మాధవరావుకి షేక్ హ్యాండ్ ఇచ్చి దిగిపోయాడు. బస్ కదిలిపోయింది. గాఢ నిద్రలోకి మునిగిపోయాడు, రోహిత్. మాధవరావుకి నిద్ర పట్టలేదు. ఆలోచనల్లో పడిపోయాడు. అవి కలగాపులగంగా ఉన్నాయి. కాసేపు రోహిత్ చదువు– కాసేపు వాడి ఆరోగ్యం– కాసేపు ఇంకేదో.... ఇంత దూరంలో చదువు అవసరమా... కాసేపు రాజారావు, వినీత్ ల ప్రవర్తన గురించి ఆలోచనల్లోనే విజయవాడ వచ్చేసింది. అక్కడ దిగి గుంటూరు బస్ ఎక్కేక– రోహిత్ భుజం మీద చేయి వేసి జాగ్రత్తలు చెప్పసాగేడు.

“... కన్నా! కడుపు నిండా తినాలి. నీరు ఎక్కువ తాగాలి. వీలయిన కాడికి సిలబస్ కవర్ చేసుకో. చెవి నుంచి నీరు కారడం తగ్గిందా” అని కొడుకును అడిగి చెవిని పరిశీలించేడు. కొంచెం తడి కనిపించింది. మాధవరావు కి ఎక్కడో చిన్న సూదిపోటు లా అనిపించింది. కాసేపు మౌనం వహించి తిరిగి మొదలు పెట్టేడు. “... టైమ్ కి డ్రాప్స్ వేయాలి. రోజుకు మూడు సార్లు. వినీత్ కి చెప్పి వేయించుకోగలవా?... ” అడిగాడు . రోహిత్ అసహనం గా తండ్రి భుజం మీద తల వాలుస్తూ “సరే” అన్నాడు. కానీ —వినీత్ ఈ మధ్యే వేరే రూమ్ కి మారేడని అందుబాటులో ఉండడం లేదనీ రోహిత్ ఇటీవల చెప్పడం మాధవ రావుకి గుర్తొచ్చింది.

తండ్రీ కొడుకులు కేంపస్ చేరుకున్నారు. పేకట్స్ పంపించిన సంగతి ఫోన్ చేసి రాజారావు ట్యూటర్ కి చెప్పేడు. ట్యూటర్ ద్వారా తెలుసుకున్న వినీత్ – హడావిడిగా రోహిత్ రూమ్ కి వచ్చేడు. ముందు రెండు పాకెట్లు అందుకున్నాడు. “...తగ్గిందా “అని అడిగేడు. రోహిత్ బాగుందన్నట్లు తల ఊపుతూ “ఈ వీకెండ్ టెస్ట్ కూడా నేనూ మిస్సయినట్టే.” అన్నాడు. “ అవును ! అలా మిస్సయిన వారికి మళ్లీ ఎగ్జామ్ పెడతామన్నారు. కానీ మరి పెట్టడం లేదని అనౌన్స్ చేశారు.

సరే నేను వస్తాను. అంకుల్ వస్తాను.” అంటూ వినీత్ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు. అంత వరకు వినీత్ చూస్తూ ఉండిపోయాడు, మాధవరావు. మూడు సంవత్సరాలు గా వినీత్ ని చూసి ఉన్న మాధవరావు కి ఆశ్చర్యంగా ఉంది. ఎప్పుడు  ఇంటికొచ్చినా రోహిత్ ని వదిలేవాడు కాదు. అలాంటిది ... !? మరి ఆలోచించలేక పోయాడు.

విజిటర్స్ రూమ్ ఉన్నప్పటికీ ఆ రాత్రి రోహిత్ దగ్గరే సర్దుకొని పడుకున్నాడు.

మరుచటి రోజు  ఆదివారం. హాస్టల్ అంతా హడావిడిగా ఉంది. చాలా మంది పేరెంట్స్ వచ్చారు. పిల్లల్ని ఔటింగ్ కి తీసుకు వెళ్తున్నారు. ఒకరిద్దరు పిల్లలు వచ్చి–“ అంకుల్ ఒక్కసారి ఫోన్ ఇవ్వరూ ... మా పేరెంట్స్ తో మాట్లాడి ఇచ్చేస్తాను...” అని వినయంగా అడిగితే కాదన లేక పోయాడు. ఆ రోజూ ఓ పదిమంది పిల్లలయినా  అలా ఫోన్ అడిగి తీసుకున్నవారే. కొందరు అక్కడే నిలబడి మాట్లాడి ఇచ్చేశారు. వారి హావభావాల్నిమాధవరావు పరిశీలిస్తూ ఉండిపోయాడు. కొందరు పక్కకు వెళ్ళి మాట్లాడి ఇచ్చేశారు. ఒకరిద్దరి కళ్ళల్లో నీళ్ళు చూశాడు.

అక్కడున్నఆ  ఒక్క పూటలోనూ వినీత్ రెండు నిమిషాలే కనిపించాడు. ఎక్కడో ఎవరితోనో  కంబయిండ్ స్టడీ అట. “...పోనీ రోహిత్ ని తీసుకెళ్ల కూడదూ ...ఇన్నాళ్ళూ క్లాసులు మిస్సయ్యాడు కదా..” అని అడిగేడు. “అక్కడ నలుగురే ఉండాలి అంకుల్. అలా మిస్సయిన  ఛాప్టర్లు వేరే ట్యూటర్స్ డీల్ చేస్తార”నీ చెప్తూ – మేము చాలా ముందుకు వెళ్ళిపోయామనీ , రోహిత్ కి చెప్పేంత టైమ్ లేదనీ చెప్పి వెళ్ళిపోయాడు. మాధవ రావు అలా చూస్తూ ఉండిపోయాడు. రోహిత్ చెవిలో చుక్కలు మందు వేస్తావా అని ఆడగాలనుకున్న మాధవరావుకి  నిరాశే మిగిలింది.

మరో వీకెండ్ పరీక్ష కూడా రోహిత్ మిస్ అయిపోయాడు, ఈ ప్రయాణాల్లో.

“.. మరి నీ చెవిలో చుక్కల మందు ఎవరు వేస్తారు?” చెవిలో డ్రాప్స్ వేస్తూ అడిగేడు మాధవరావు రోహిత్ ని.

“రూమ్ లు తుడవడానికి ఆయమ్మలు వస్తారు నాన్నా. ఆళ్ళతో డ్రాప్స్ వేయించుకుంటానులే” అని అన్నాడు. ఆ నీరసంలో ఆ నిస్సహాయపు మాటలు విన్న మాధవరావుకి కళ్ళల్లో నీళ్ళు చివ్వున చిమ్మేయి. పక్కకు తిప్పుకున్నాడు మొఖం, కొడుక్కి కనబడకుండా.

ఆ రాత్రికే బయలుదేరిపోవాలి మాధవరావు. ప్రతీసారీ అతనికి ఇదో హృదయ భారమైన తప్పనిసరి వీడ్కోలు. మేడమెట్లు దిగుతూ — ‘నువ్వు ఉండిపో నాన్నా’ అని తాను అంటాడు. ‘ఫరవాలేదు... కింద గేటు వరకూ వస్తాన’ని వాడంటాడు. ఇలా రెండు మూడు సార్లు ఇద్దరమూ అనుకోవడం పరిపాటి. తాను బాధ పడుతునట్టుగా కనబడితే, వాడు ఎక్కడ డల్  అవుతాడేమో అని మాధవరావు భయం. కానీ ఈసారి రోహితే ధైర్యంగా ఉన్నట్లనిపించాడు. టాటా చెప్తూ– ఎవరో అబ్బాయి వస్తే అతడి భుజంమీద చెయ్యి వేసి వెనక్కి తిరిగి మెట్లవైపు కదిలిపోయాడు.

ట్రైన్ కదిలింది. ఎప్పటిలాగే ఒక్కొక్క స్టేషనూ దాటిపోతోంది. ఆలోచనలు కమ్ముకుంటున్నాయి.

పది రోజులు గడిచేయి. రోహిత్ కి ఎలా ఉందోనన్నబెంగ ఎక్కువయింది, శైలజా మాధవరావు లకు. కొన్ని మందులు అందించాల్సి ఉంది. శైలజ ఉండలేక “రాజారావు అన్నయ్య వెళతాడేమో అడగండి” అని అంది. మాధవరావు ఫోన్ చేసి రాజారావుని అడిగేడు “ఈ వారంలో గుంటూరు వెళ్తావా?” అని.

“ఆఫీసు పని ఎక్కువయిందనీ, వెళ్లడం లేద”ని చెప్పాడు. తిరిగి– ‘నువ్వు వెళ్తే చెప్పు దీపావళికి క్రాకర్స్ కొన్నాను...వినీత్ కి అందించాలి’ అన్నాడు.

ఎప్పుడూ లేనిది మాధవరావుకి కోపం వచ్చింది. శైలజకు ఇంకా కోపం వచ్చింది. “ గొప్ప ఫ్రెండే. మనం ఎక్కువ సార్లు వెళ్ళేం. వెళ్ళినప్పుడల్లా వాళ్ళందంచిన పేకెట్స్ పిల్లాడికి అందించాం. ఆ పిల్లాడు కూడా మన బాబు తో సరిగా ఉండడం లేదట కదా...ఉండండి ఆవిడకే చేస్తాను ” అని భర్తతోఅనేసి– కోపాన్ని అణుచుకుంటూ ఇందిరకు ఫోన్ చేసింది. మాధవరావు వద్దని సైగలు చేస్తున్నాడు. అయినా ఆమె ఆగలేదు. ఇందిర ఫోన్ లిఫ్ట్ చేయగానే–

“ఈసారి మీరు పిల్లల దగ్గరికి వెళ్తే బాగుణ్ణు వదిన గారూ! మేమే ఎక్కువ సార్లు వెళ్ళేము...” అడిగేసింది శైలజ. ఆ గొంతులోని నిష్టూరం పసిగట్టేసిన ఇందిర తన గొంతులో మార్దవాన్ని నింపుకుంటూ “ఏమో వదినా అంతా మీ అన్నయ్య ఇష్టం. అప్పుడుకీ చెప్పాను అతనికి... వాళ్ళ కష్టాల్లో వాళ్ళున్నారు. ఇబ్బంది పెట్టకండీ అని. ఈ మధ్యనే ఒకరిద్దరు పరిచయమయ్యారు. వాళ్ళ తో పంపిద్దామని కూడా చెప్పాను. అయినా వినరు. ‘అదేంలేదు మా ఫ్రెండు అలా ఏమీ అనుకోడు’ అంటారు. ఎవరికెవరండీ ఈ కాలంలో! ... పోనీలెండి. ఎవరికి నచ్చింది వాళ్ళు చేద్దాం. ఇప్పుడేమయిందని. అయినా– మీ రోహిత్ కి బాగులేక మీరు అన్ని సార్లు వెళ్ళి ఉండొచ్చేమో గానీ– లేకపోతే వెళ్తారా ఏంటి ?” అని అనేసి ఫోన్ పెట్టేసింది. ఆవిడ మాటలకి శైలజ నిలువునా నీరయి పోయింది.

★ ★ ★

కాలం గడుస్తోంది. గ్రాండ్ టెస్ట్ కూడా జరిగిపోయింది. వినీత్ సెలెక్ట్ అయ్యాడు. రోహిత్ కష్టపడినప్పటికీ వంద లోపు రేంక్ రాలేదు. చాలా బాధ పడిపోయాడు. ఆ సాయంత్రం ప్రిన్సిపాల్ ని కలవాలనుకున్నాడు. వినీత్ ని అతి కష్టం మీద కలిసి తోడు రమ్మన్నాడు. “నాకూ వీలవ్వదురా. గ్రాండ్ టెస్ట్ లో సెలెక్ట్ అయినవాళ్ళని మా ఫెకల్టీ ఈ సాయంత్రం ఎందుకో రమ్మన్నారు ... సారీ రా” అని చెప్పి వెళ్ళిపోయాడు.

రోహిత్ ఒక్కడే వెళ్ళి ప్రిన్సిపాల్ ని కలిసేడు. చాలా ప్రాధేయపడ్డాడు. ఒక్క అవకాశం ఇమ్మని అడిగేడు. నేనూ రెండు వారాలు మిస్సయినా మంచి రేంకే వచ్చిందనీ చెప్పేడు. అనారోగ్య కారణం వల్లనేననీ, అశ్రద్ధ వల్ల కాదనీ వివరించేడు. అయినా అతను ఒప్పుకోలేదు. మరో నెలలో రెండో గ్రాండ్ టెస్ట్ ఉంటుందనీ దానికి ప్రిపేర్ అవ్వమనీ చెప్పేడు. రోహిత్ కి తెలుసు అది అబద్ధ మని. మామూలు ఫెకల్టీ తో అది సాధ్యం కాదని . ఆ చిన్నమనసుకు ఎంత తెలుసో అంతలా ప్రాధేయ పడ్డాడు. అప్పుడే అటెండర్ తెచ్చిన ఫైల్ లో ప్రిన్సిపాల్ తల దూర్చేశాడు. రోహిత్ తల వంచుకొని బయటకొచ్చేశాడు.

రెండు రోజులు గడిచింది. ఆ రోజు ఆదివారం. పేరెంట్స్ వస్తున్నారు. పిల్లల్ని కలుస్తున్నారు. అవుటింగ్ వెళ్ళిన వారు వెళ్తున్నారు. కొందరు బెంచీల మీద – పిల్లల్నిఒడిలో కూచోబెట్టుకొని మాట్లాడుతున్నారు. ఒక బెంచీ మీద – వినీత్ అమ్మా నాన్నలు. మధ్యలో వినీత్. ఆశ్చర్యపోయాడు రోహిత్. అమ్మానాన్నలు ఏమైనా పంపించారేమో అనుకుని వెళ్ళి కలిశాడు. వాళ్ళు మామూలుగా పకరించేరు . ఎలా ఉంది ఆరోగ్యం ? ఎలా చదువుతున్నావు? ఇలాంటి ప్రశ్నలు వేశారు. వాళ్ళ మధ్య వినీత్ పక్కన తనని ప్రేమతో కూచోబెట్టుకుంటారనుకున్నాడు. చివరికి రోహితే "అంకుల్ నాన్న ఏమైనా చెప్పారా మందులు ఏమైనా ఇచ్చారా ..." అని అడిగేడు. వినీత్ నాన్న సంజాయిషీగా – "లేదు బాబూ మేము అనుకోకుండా సడన్ గా వచ్చేసేము. ఇదిగో వీడు గ్రాండ్ టెస్ట్ లో సెలెక్ట్ అయ్యేడని తెలిసింది. వీళ్ళకి అప్పుడులాగా కలవడం అవ్వదట కదా. సెపరేట్ గా అక్కడెక్కడో టైటానిక్ బిల్డింగ్ లో ఉంచుతారట ... " అన్నాడు.

వినీత్ అందుకొని – "...వీడికీ తెలుసు . చాలా పెద్ద బిల్డింగ్ ... ఏ సీ రూములు .. వేరే భోజనం వేరే ఫేకల్టీ .. అవుటింగ్ కి కూడా వాళ్ళే తీసుకెళ్తారు. సీ సీ కెమెరాలు .. మా కేంపస్ లోనే డైరెక్టర్ ఉంటాడట ... ఎవ్వరూ కలవడానికి లేదు." చెప్పుకు పోతున్నాడు. "నువ్వు మాత్రం పాత స్నేహాలు పట్టుకు ఏళబడకు... ఎవరికీ రాని అవకాశం నీకొచ్చింది..."ఇంకా ఏదో చెప్ప బోతోంది. రోహిత్ కల్పించుకొని– " అంకుల్ ఒక్కసారి ఫోన్ ఇస్తారా? అమ్మతో మాట్లాడుతాను " అని అడిగేడు. రాజారావు ఫోన్ ఇవ్వబోయాడు. యమున చెయ్యి అడ్డంపెట్టి – " బాబూ మీ వాళ్ళకి చెప్పకుండా వచ్చేము కదా. ఇప్పుడు మేము వచ్చినట్టు తెలిస్తే బాధ పడతారు. నువ్వూ చెప్పకేం ..."అంది. అంటూ –"... మేము అవుటింగుకి వెళ్తున్నాం వస్తావా?" అని అడిగింది. రోహిత్ కి పరిస్థితి అర్థమైంది. రాలేనని చెప్పేసి– వాళ్ళకి 'బై'చెప్పి అక్కడ నుంచి కదిలిపోయేడు.

వాళ్ళకు కనిపించనంత దూరం వెళ్ళేక – అక్కడ– ఒకరిద్దరికి ఫోన్ అడిగాడు. ఛార్జింగ్ లేదని ఒకరూ, బేలెన్స్ లేదని ఒకరూ అనేశారు. ఒకాయన మొహం ప్రశాంతంగా కనిపించింది. " అంకుల్ ఒక్కసారి ఫోన్ ఇయ్యరూ . మా అమ్మతో మాట్లాడతాను." వినయంగా అడిగేడు రోహిత్ . అతను నవ్వుతూ ఫోన్ అందిచ్చాడు. ఎన్నిరింగులయినా అవతల ఫోన్ ఎత్తడం లేదు. విసిగిపోయి కొంత, అతను ఏమనుకుంటాడోనని కొంత బిడియపడి ఫోన్ తిరిగి ఇచ్చేశాడు. ఫోన్ అందుకుంటూ "ఏం బాబూ?" అని అడిగేడు. "కొత్త నెంబర్ కదా అంకుల్ అందుకే ఎత్తడం లేదేమో" అని అంటుండగా ఫోన్ రింగ్ అయ్యింది. "మీ మదరే లాగుంది మాట్లాడు" అని అందించేడు.

★ ★ ★

మరో రెండు రోజులు గడిచింది. లంచ్ అవర్ లో –ఓ చెట్టు కింద– మాధవరావు,రోహిత్ లు మాట్లాడుకుంటున్నారు. "నాన్నానాకు రేంకు రాలేదని బాధ పడుతున్నారా?" తండ్రి భుజంమీద చేయి వేసి అడిగేడు. " అదేం లేదు

కన్నా.అదొక్కటే గోల్ కాదు కదా. నువ్వు ఆరోగ్యంగా ఉంటే అదే చాలు. నీ చదువులో లోపం లేదు. ఆ విషయం నాకూ తెలుసు...”

అప్పుడు నెమ్మదిగా అడిగేడు రోహిత్. “నాన్నా! మీరూ, వినీత్ ఫాదరూ ఏమైనా తగువులు పడ్డారా?” అని.

“ లేదు కన్నా... నువ్వూ,వినీతూ ఏమైనా గొడవ పడ్డారేమో అని నేనకున్నాను... ఏం ఎందుకని?” అని అడిగేరు. రెండు రోజుల క్రితం వినీత్ అమ్మానాన్నలు వచ్చిన సంగతి, కలిసిన సంగతి తండ్రికి చెప్పేడు. కొత్తసేపు మౌనం తర్వాత– “ దానికేముంది కన్నా! ఎవరి వీలును బట్టి వాళ్ళు వస్తారు. నువ్వు అవేం పట్టించుకోకు. హేపీగా ఉండు.” అన్నాడు.

“ అలాగే నాన్నా” అని రోహిత్ టైమ్ చూశాడు. “ నాన్నా టైమ్ అయ్యింది. ” అన్నాడు.

మాధవరావు లేచి నిలబడి చెప్పాల్సిన జాగ్రత్తలు చెప్పి బయలు దేరిపోయాడు.

★ ★ ★

మాధవరావు బస్సులో కూచున్నాడు. కాసేపటికి బస్సు కదిలింది. వేగం అందుకుంది. పొలిమేరలు దాటిపోతోంది. మామూలే ...గుంటూరు దూరమౌతోంది. ఊరు దూరమవ్వడమేనా...!? జీవన ప్రయాణం లో మనుషులూ...దూరమవ్వడం అర్థమవుతోంది, మాధవరావుకి. వద్దనుకున్నా రాజారావు గుర్తుకు వచ్చాడు. రాజారావుకీ తనకీ మధ్య దూరంతో పాటు– రోహిత్ కీ వినీత్ కీ మధ్య దూరంతో పాటు –తొందరగా కలిసిపోయిన తమ భార్యల మధ్య పెరిగిన దూరం గుర్తొచ్చింది. మరి రేపు ... తండ్రులకూ పిల్లలకూ మధ్య కూడా దూరం పెరుగుతుందా ? అన్న ప్రశ్నతో గుండెల్లో గుబులు పుట్టి చమట్లు పట్టాయి. కళ్లు మూసుకున్నాడు... బస్సు గుంటూరు దాటి చాలా దూరం వచ్చేసింది.

★ ★ ★

COMMENTS